అతిసారం నియంత్రణకు చర్యలు

- నెరణికి తండాను సందర్శించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్
- బాధితుల పరామర్శ
- వైద్య శిబిరాన్ని కొనసాగించాలని ఆదేశం



నెరణికి తండాలో మహిళ ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్



బాధితులకు పంపిణీ చేసే మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండా గ్రామాన్ని మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్ సందర్శించారు. గ్రామంలో అతిసార వ్యాధి ప్రబలి పలువురు అస్వస్థతకు గురి కావడం, అదే లక్షణాలతో చంద్రికబాయి అనే వృద్ధురాలు మరణించిన సంగతి తెలిసిందే. దీంతో గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ ఇంటింటికీ తిరిగి అతిసారం బాధితులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడ్తున్న వారిని కలిసి ఆరోగ్య పరిస్థితి, అనారోగ్యానికి గురికావడానికి కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హొళగుంద పీహెచ్‌సీ డాక్టర్ న్యూటన్‌తో పాటు ఏఎన్‌ఎంలు, హెల్త్ సిబ్బందితో మాట్లాడి గ్రామంలో అతిసారం నియంత్రణకు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. మరో వారం రోజుల పాటు హెల్త్ క్యాంపును కొనసాగించాలని గ్రామ ప్రజలకు సరిపడా మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని, అలాగే పంచాయతీ అధికారులు నీటి ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్తులు తమ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, అలాగే వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కాచి ఒడబోసిన నీటిని తాగాలని సూచించారు. టెస్టింగ్ కోసం పంపిన శ్యాంపిల్స్‌ను పరీక్షించగా నీరు కలుషితం అయినట్లు రిపోర్ట్ వచ్చినట్లు డాక్టర్ న్యూటన్ తెలిపారు. దీంతో సత్వర చర్యలు చేపట్టి గ్రామానికి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు అరికెర వద్ద లీకేజీని గుర్తించి మరమ్మతు పనులు చేపట్టారు. వీరితో పాటు ఆదోని డీఎల్‌పీఓ నూర్జహన్ గ్రామాన్ని సందర్శించి పంచాయతీ సెక్రటరీలకు తగు సూచనలు చేశారు. జిల్లా ఎపిడమాలజిస్ట్ వేణుగోపాల్, ఎఫ్‌డీపీ నోడల్ అధికారి బాలమురళి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు, ఎంపీహెచ్‌ఈఓ చలపతి, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సమస్యను సృష్టించొద్దు



దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మంజునాథ్

ఆదోని అర్బన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను సృష్టించవద్దని ట్రాఫిక్ సీఐ మంజునాథ్ దుకాణదారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో.. భీమా సర్కిల్ నుంచి ఓల్డ్ బ్రిడ్జి వరకు ఉన్న దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు తెలియజేశారు. దుకాణాలకు వచ్చే వారి వాహనాలను రోడ్డు మీద నిలపరాదన్నారు. దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి బంకులు, తోపుడు బండ్లను ఏర్పాటు చేయడం వల్ల రహదారిపై వెళ్లే ప్రజలకు, వాహనదారులకు అంతరాయం కలిగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. దుకాణాల ముందు యజమానులు నో పార్కింగ్ బోర్డులు పెట్టాలని, వాచ్‌మెన్‌ను నియమించుకుని వాహనాలు రాంగ్ పార్కింగ్ చేయకుండా చూసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే దుకాణదారులకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్లుప్తంగా

కేంద్ర కరువు బృందం పర్యటన రద్దు

మద్దికెర: మండలానికి బుధవారం కేంద్ర కరువు బృందం రావాల్సి ఉండగా, కార్యక్రమం రద్దయ్యిందని ఏఓ రవి మంగళవారం తెలిపారు. ప్రభుత్వం మండలాన్ని రబీ సీజన్‌కు కరువు మండలంగా గుర్తించిందని, దానికి సంబంధించి రైతులతో సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఆరు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. అయితే అనివార్య కారణాల వల్ల కొన్ని మండలాలలో మాత్రమే కేంద్ర బృందం పరిశీలన నిర్వహించడం జరుగుతోందని, అందులో మద్దికెర మండలంలో లేదన్నారు. రైతులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

మట్టిని తొలగించండి

మద్దికెర : స్థానిక రాంనగర్‌లో వర్షపునీరు వెళ్లకుండా కొంతమంది మట్టిని వేస్తుండడంతో ఇళ్లలోకి నీరు చేరుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. మట్టిని తొలగించాలని సర్పంచ్ సుహాసినికి కాలనీవాసులు రామలింగప్ప, లక్ష్మిదేవితో పాటు మరికొందరు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వర్షం వచ్చిందంటే కాలనీలో ఇళ్లలోకి నీరు వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లడమే గాకుండా దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు ఇళ్ల ముందు మట్టి వేయకుండా చర్యలు తీసుకోవాలని అలాగే ఇక ముందు వేయకుండా చూడాలన్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ మట్టిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులకు రూ.50 వేల నగదును అందజేస్తున్న సీఐ శ్రీనివాసులు

దేవనకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న శ్రీనివాసులు 20 రోజుల క్రితం గుండెపోటుకు గురై మృతిచెందిన విషయం విదితమే. ఈ మేరకు మంగళవారం బాధిత కుటుంబాన్ని సీఐ శ్రీనివాసులు పరామర్శించారు. రూ.50 వేలు నగదును బాధిత కుటుంబానికి అందించారు. ధైర్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారికి సీఐ హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో హోంగార్డు శ్రీనివాసులు మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. పోలీసు సిబ్బంది ఉన్నారు.

17,164 మంది రైతులకు 'పీఎం కిసాన్'

తుగ్గలి : ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు ప్రధాన మంత్రి కిసాన్ యోజన ద్వారా రైతులకు ఆర్థిక సాయం అందుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సన్న, చిన్నకారు రైతులకు పీఎం కిసాన్ ద్వారా మొదటి విడతగా రూ.2వేలు వారి ఖాతాల్లో మంగళవారం జమ చేశారు. మండలంలో 17,164 రైతులకు లబ్ధి చేకూరింది. వీరికి మొత్తం రూ.3,43,28000 వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అవుతోంది.


జీడీపీకి సందర్శకుల తాకిడి



గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద జలకాలాడుతున్న సందర్శకులు

గోనెగండ్ల: బక్రీద్ పండుగను పురస్కరించుకొని మంగళవారం ముస్లింలు కుటుంబ సమేతంగా గాజులదిన్నె ప్రాజెక్టు వద్దకు చేరుకుని సరదాగా గడిపారు. కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి కార్లు, బైక్‌లు, ఆటోలలో ప్రాజెక్టు వద్దకు చేరుకుని ఫొటోలు దిగుతూ సందడి చేశారు. కబుర్లు చెప్పుకుంటూ ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారం, వంటకాలతో బంతి భోజనం చేశారు. అనంతరం ప్రాజెక్టు గేట్లు, పరిసరాలను సందర్శించి నీటిలో జలకాలాడుతూ సరదగా గడిపారు. సందర్శకుల రాకతో ప్రాజెక్టు వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పండగ వాతావరణం కనిపించింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

ఆదోని అర్బన్: పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో అమరావతినగర్‌కు వెళ్లే రహదారిలో ఓ చెట్టు కింద గుర్తు తెలియని వ్యక్తి (45) మంగళవారం మృతిచెందారు. దీనిపై స్థానికులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిసర ప్రాంతాల్లో విచారణ చేయగా మృతి చెందిన వ్యక్తి ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిసింది. అతని వ్యక్తిగత వివరాలు తెలియరాలేదు. పెద్దల సమక్షంలో పంచనామా చేసి మున్సిపల్ అధికారులకు మృతదేహాన్ని అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, అధికారులు, సభ్యులు

మద్దికెర: మేజర్ పంచాయతీ మద్దికెరలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని, గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి కోరారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన పంచాయతీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో జరగవలసిన అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల సేకరణ గురించి ఈఓఆర్డీ తెలియజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ కాలనీలలో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రజలు వచ్చినపుడు సంబంధిత పంచాయతీ సభ్యులకు తెలియకుండా అనుమతులిస్తున్నారని, అలా కాకుండా సభ్యుల సంతకాలు వుండేలా చూడాలన్నారు. దీంతో అక్రమ నిర్మాణాలు జరగకుండా ఆపేందుకు వీలవుతుందన్నారు. అలాగే పంచాయతీ గదులను వేలాలు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆంజనేయులు, ఉప సర్పంచ్ ప్రమీలమ్మ, సభ్యులు కిట్టి, బాలచంద్ర, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి



మృతిచెందిన కురువ రామాంజనేయులు

దేవనకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కురువ రామాంజనేయులు (22) కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మృతుడి తండ్రి గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ నెల 16న సాయంత్రం 5:30 గంటల సమయంలో దేవనకొండలోని సీఎల్‌ఆర్ భవనం వద్ద కుంకనూరుకు చెందిన కురువ రామాంజనేయులు అనే యువకుడు హోండా షైన్ బైకుపై అతివేగంగా వస్తూ రోడ్డు నిర్మాణంలో ఉన్నందువల్ల సైడ్‌కు ఏర్పాటు చేసిన రాళ్లను బలంగా ఢీకొట్టి కింద పడిపోయాడన్నారు. తలకు తీవ్ర గాయం కావడంతో బంధువులు కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. రెండు రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రామాంజనేయులు మృతిచెందినట్లు చెప్పారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ఈరన్న

హాలహర్వి: 14 సంవత్సరాల్లోపు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంఈఓ ఈరన్న అన్నారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. విద్యార్థుల చేత గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి బడిఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లోని బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడం, గ్రామ వలంటీర్ల సాయంతో ఆ పిల్లలను బడిలో చేర్పించడం, స్టూడెంట్ కిట్ ఇతర విద్యా ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు.

శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలి



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో సమావేశమైన డీఈ మల్లికార్జునయ్య

ఆలూరు: గ్రామ పంచాయతీలలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను వారానికి ఒకసారి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయాలని ఆలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య అసిస్టెంట్ ఇంజనీర్లను ఆదేశించారు. శుద్ధి చేసిన నీటినే గ్రామాలకు సరఫరా చేయాలన్నారు. హొళగుంద మండలం నెరణికి తండా గ్రామంలో చంద్రికాబాయి (60) అనే వృద్ధురాలు అతిసారా వ్యాధితో మృతి చెందినట్లు ఆదోని డీఎల్‌పీఓ నూర్జహన్, హొళగుంద పీహెచ్ కేంద్రం డాక్టర్ న్యూటన్ నిర్ధారించారని చెప్పారు. ఈ మేరకు తాగునీటి సరఫరాలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. హాలహర్వి మండలం బాపురం, చింతకుంట, సమ్మత్‌గేరి, బందగట్టు, ఎల్లార్తి తదితర గ్రామాల ఎస్‌ఎస్ ట్యాంకుల నుంచి ప్రజలకు తాగునీటిని విడుదల చేసే ముందుగా క్లోరినేషన్ చేయించే బాధ్యత సంబంధిత ఏఈలపై ఉందన్నారు. ప్రధానంగా సీజనల్ వ్యాధుల నియంత్రణ ఆరోగ్య, శానిటేషన్, తాగునీటి శాఖలకు ముడిపడి ఉందని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఏఈలు మోహన్‌బాబు, రాంనీలా, రవి సిబ్బంది తదితరులు ఉన్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

ఆలూరు: ఆలూరు నియోజకవర్గంలో కరువు పరిశీలన నిమిత్తం బుధవారం కేంద్ర అధికారుల బృందం చిప్పగిరి మండలంలో పర్యటించనున్నట్లు ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. ఆలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో 2023–24 రబీ సీజన్‌లో కరువు కారణంగా పంటలు దెబ్బతినడంపై ఆలూరు మండలం హత్తిబెళగల్, హుళేబీడు, తుంభళబీడు, కమ్మరచేడు గ్రామాలకు చెందిన రైతులతో పంట సాగుకు పెట్టిన పెట్టుబడి, దిగుబడి, కనీస మద్దతు ధర తదితర అంశాలపై చర్చిస్తారన్నారు. మండలస్థాయి అధికారులు హాజరుకావాలని ఏడీఏ సునీత సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి
- గూళ్యం గ్రామంలో పర్యటన



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి అన్నారు. మంగళవారం మండలంలోని గూళ్యం గ్రామంలో పర్యటించారు. ముందుగా హులిగమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నాగనాథనహళ్లి రాము, రామచంద్ర పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ తర్వాత గూళ్యం గాదిలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తనదృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామిరెడ్డి, మండల కో కన్వీనర్ మల్లికార్జున, యూత్ నాయకులు గంగాధర గోపాల్, లింగప్ప, శేఖన్న, రామచంద్ర, బసవరాజు, రాము, దిబ్బలింగ తదితరులు పాల్గొన్నారు.

కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు



విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేస్తున్న భక్తులు



పూజలందుకుంటున్న కూర్మ నారాయణ స్వామి



పూజలందుకుంటున్న హనుమప్ప స్వామి

ఆస్పరి: మండలంలోని హాలిగేరి సమీపంలోని గుహలో వెలసిన స్వయంభూ కూర్మనారాయణ స్వామి జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు నరేష్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి క్షీర, చందన, నదీ జలాలతో అభిషేకం, శ్రీలక్ష్మీ అష్టోత్తర సహితంగా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రావి చెట్టుకు పూజలు, భక్తుడు హనుమప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారి చిత్రపటంతో గిరి ప్రదక్షిణ, నాగదేవత పుట్టలకు పూజలు చేశారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు భజనలు చేశారు.

ఎంఈఓ బాలనాయుడుకు నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

చిప్పగిరి: ఎంఈఓ బాలనాయుడు మృతి విద్యారంగానికి తీరని లోటని ఎంఈఓ– 1 సావిత్రమ్మ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ బాలనాయుడు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం ప్రేయర్‌లో విద్యార్థుల చేత మౌనం పాటించి అంజలి ఘటించారు. సావిత్రమ్మ మాట్లాడుతూ బాలనాయుడు మండలానికి వచ్చిన అనతి కాలంలోనే ఉత్తమ సేవలందించి మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. ఈ నెల 15 ఆయన గుండెపోటు తో మరణించడం మండల ఉపాధ్యాయులను తీవ్ర వేదనకు గురి చేసిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రంలో కార్యాలయ సిబ్బంది శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల కల్పనకు చర్యలు తీసుకోండి



ముద్దనగేరిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరేంద్రకుమార్

ఆలూరు: వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేందుకు ఏపీఓ, టీఏ, ఎఫ్ఏలు చర్యలు తీసుకోవాలని ఆలూరు ఎంపీడీఓ నరేంద్రకుమార్ సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని ముద్దనగేరి, కరిడి గుడ్డం, అరికెర తదితర గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. జాబ్ కార్డులు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పించే బాధ్యతను ఆ గ్రామ పంచాయతీకి చెందిన ఎఫ్ఏలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఐదు ఎకరాల్లోపు పొలం కలిగి బోరుబావులున్న రైతులు 16 రకాల పండ్ల తోటల సాగు చేపట్టవచ్చని, ఆ మేరకు ఉద్యాన శాఖ రాయితీలు అందిస్తుందని వివరించారు. దీనిపై ఉపాధి సిబ్బంది గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాసులు, టీఏలు మారెన్న, వెంకటేష్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వినాయక ఘాట్ ఏర్పాటు చేయాలి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న విశ్వహిందూ పరిషత్, గణేష్ ఉత్సవ సమితి నాయకులు

పత్తికొండ రూరల్ : పత్తికొండ–హోసూరు రోడ్డులో వినాయక ఘాట్ ఏర్పాటు చేయాలని గణేష్ ఉత్సవ సమితి నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ నీలపు రామలక్ష్మికి విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వీహెచ్‌పీ అధ్యక్షుడు వీర్రాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కరణం నరేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి భారీ వినాయక విగ్రహాలు తెప్పించి అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉత్సవాల నిర్వహణ గడువును 3నుంచి 5 రోజులకు పెంచాలని కోరారు. అలాగే విగ్రహాల నిమజ్జనాన్ని హంద్రీనీవాలో చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందువల్ల హోసూరు రోడ్డులోని హంద్రీనీవా ప్రధాన కాలువ వద్ద వసతులతో కూడిన ఘాట్‌ను ఏర్పాటు చేసి గణపతి ఉత్సవాలను సజావుగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు గోవర్ధన్‌నాయుడు, బ్రహ్మయ్య, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ కంది, కొర్రలను వినియోగించుకోండి

పత్తికొండ రూరల్ : ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న కంది, కొర్రలను రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో 1,255 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామన్నారు. 1,850 క్వింటాళ్ల వేరుశనగ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు. మండలానికి ఎల్ఆర్‌జీ–105 రకం 25 క్వింటాళ్లు, ఆశా–87119 రకం కందులు 25క్వింటాళ్లు, అలాగే 8156 రకం కొర్రలను కేటాయించడం జరిగిందన్నారు. విత్తనాలు పత్తికొండ మండలం రైతులు రైతు భరోసా కేంద్రం–3లో అందుబాటులో ఉన్నాయన్నారు. హోసూరులోని ఆర్‌బీకేలో 28 28 0 రకం యూరియాని రైతుల కోసం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేలను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఫక్కుమియ్యావలి ఉరుసు




స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పత్తికొండ రూరల్ : పట్టణంలోని చక్రాళ్ల రోడ్డులో ఊరిచెరువు సమీపంలో కొలువైన హజరత్ ఫక్కుమియ్యా వలి సాహెబ్ ఉరుసు మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దర్గాను అందంగా అలంకరించి, విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. మహిమాన్వితుడుగా పేరొందిన ఫక్కుమియ్యావలి స్వామిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తాదులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దర్గా ప్రాంగణంలో చిరువ్యాపారులు అంగళ్లు ఏర్పాటుచేశారు. బుధవారం జియారత్‌తో ఉరుసు వేడుకలు ముగుస్తాయని ముజావర్లు పి.మక్తుమ్, హుసేన్‌సా, అల్లాబకాష్ తెలిపారు.

టీబీ డ్యాంలో తగ్గిన ఇన్‌ఫ్లో

- గరిష్ట నీటి మట్టానికి చేరువలో గాజనూరు జలాశయం
- నేడో, రేపో గేట్లు ఎత్తి టీబీ డ్యాంకు నీటిని విడుదల చేసే అవకాశం



తుంగభద్ర జలాశయం

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతుండగా అవుట్ ఫ్లో మాత్రం పెరిగింది. ఈ నెల 10న అవుట్ ఫ్లో కేవలం 10 క్యూసెక్కులు మాత్రమే ఉండి ఇన్‌ఫ్లో 4 వేల క్యూసెక్కులకు పైగా ఉండేది. ఈ కారణంగా డ్యాంలో 6 టీఎంసీలకు పైగా నీరు నిల్వ అయ్యాయి. అయితే మంగళవారం ఇన్‌ఫ్లో 801 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో పాటు రాయచూరుకు సంబంధించి లెఫ్ట్ బ్రాంచ్ మెయిన్ కెనాల్ (ఎల్‌బీఎంసీ)కు 1620 క్యూసెక్కులు, రాయబసవన కాలువకు 116, జిందాల్‌కు 10 క్యూసెక్కులతో కలిపి 1752 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఈ కారణంగా మంగళవారం డ్యాంలో నీటిమట్టం 5.9 టీఎంసీలకు తగ్గింది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో నాలుగున్నర టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండింది. టీబీ డ్యాం పూర్తిమట్టం 1633 అడుగులతో 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా ప్రసుతతం 1582.81 అడుగులతో 5.979 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నిండుతున్న గాజనూరు (తుంగ) జలాశయం

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో గత కొద్ది రోజులుగా ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో టీబీ డ్యాం ఎగువన 3.10 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న గాజనూరు జలాశయం (తుంగ ప్రాజెక్ట్)లో నీటి నిల్వ గరిష్ట మట్టానికి చేరుతోంది. దీంతో నేడో, రేపో జలాశయం గేట్లను ఎత్తే అవకాశం ఉండడంతో దిగువన ఉన్న తుంగభద్ర డ్యాంకు నీరు పరుగున రానున్నాయి. ఎగువన ఉన్న చిక్క మంగళూరు, కొప్పి, శివమొగ్గ, శృంగేరి, వరనాడు, మలేనాడు, తీర్థనహళ్లి తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు అక్కడి వాగులు, వంకలు, నదుల్లో వరద పెరుగుతోంది. గతేడాది దిగాలు చెందిన రైతులు తుంగా నుంచి నీరు విడుదలై టీబీ డ్యాం త్వరగా నిండాలని ఆశగా ఎదురు చూస్తున్నారు.